
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం ၊ 29 ၊ నవంబర్ ၊ 2023



29.407 టీఎంసీల నిల్వ

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 29.407 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 531 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.63,800
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,735
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,907
సవర (8 గ్రాములు)	రూ.47,256

గరిష్టం/కనిష్టం
31.0 /24.3

వాతావరణం

మంగళవారం గాలిలో తేమ 79 శాతం ఉంది. జిల్లాలో అక్కడక్కడ కొద్దిపాటి వర్షం కురిసింది. బుధవారం జిల్లాలో వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

సాగరమిత్ర పోస్టులకు ఇంటర్వ్యూలు



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

నెల్లూరు (పొగతోట): మత్స్యశాఖకు సంబంధించి సాగర మిత్ర పోస్టుల భర్తీ ప్రక్రియ నిర్వహించారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 30 పోస్టులకు 270 మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూలకు 205 మంది హాజరయ్యారు. అధికారులు అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మెరిట్, రోస్టర్ ఆధారంగా పోస్టుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

2,120 హెక్టార్లలో మొక్కల పెంపకం

- డీఎఫ్‌ఓ చంద్రశేఖర్



డీఎఫ్‌ఓ చంద్రశేఖర్

ఉదయగిరి: జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి 2,120 హెక్టార్లలో మొక్కల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అటవీ శాఖాధికారి ఆవుల చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం స్థానిక అటవీ రేంజ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే 80 హెక్టార్లలో మొక్కల పెంపకం చేశామన్నారు. మిగిలిన 40 హెక్టార్లలో డిసెంబరు నాటికి మొక్కల పెంపకం పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో 354 కేసుల్లో ఉన్న పాత ముద్దాయిలను పోలీసుల సహకారంతో అరెస్ట్ చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. వీఎస్ఎస్‌ల్లో సుమారు 1.70 మెట్రిక్ టన్నుల జామాయిల్ దిగుబడి ఉండగా, ఇప్పటికే 90 వేల మెట్రిక్ టన్నుల జామాయిల్ హార్వెస్ట్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ బోగ్యం శ్రీనివాసులు, ఎఫ్‌బీఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాంట్రాక్ట్ పోస్టుల తుది జాబితా

నెల్లూరు సిటీ: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ అండ్ సపోర్టింగ్ స్టాఫ్(మహిళ) పోస్టులు కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నారు. అభ్యర్థుల తుది జాబితాను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం spsnellore.ap.gov.in/notice/recruitment వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నారని జిల్లా డీఎం అండ్‌హెచ్‌ఓ పెంచలయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో 12 మి.మీ వర్షపాతం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లావ్యాప్తంగా మంగళవారం సగటున 12 మి.మీ వర్షపాతం కురిసింది. గరిష్టంగా పొదలకూరు మండలంలో 62.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వెంకటాచలంలో 55.2, సైదాపురం 52.6, రాపూరు 43.2, చేజర్ల 39.2, మనుబోలు 38.2, కలువాయి 37, అనంతసాగరం 25.4 దుత్తలూరు 23.2, ముత్తుకూరు 14.2, ఆత్మకూరు 13.6, ఉదయగిరిలో 12.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

నాన్‌బెయిలబుల్ కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): యానాదుల సంక్షేమ సంఘం, జనసేన నేతలపై దర్గామిట్ట పోలీసులు నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... మనుబోలు సెక్షన్ పరిధిలోని వీరంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్ చిట్టేటి భానుచందర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ యానాది సంక్షేమ సంఘం, జనసేన నేతలు ఈనెల 27వ తేదీన విద్యుత్ భవన్ ముట్టడించారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో మహిళా కానిస్టేబుల్ మల్లిక కాలికి గాయమైంది.ఈ సంఘటనపై దర్గామిట్ట పోలీసులు యానాది సంక్షేమ సంఘం నాయకుడు కేసీ పెంచలయ్య, జనసేన నాయకుడు గునుకుల కిశోర్‌తో పాటు మరో ఆరుమందిపై కేసు నమోదు చేశారు.

అపస్ రాష్ట్ర సహాధ్యక్షుడిగా చక్రపాణి



కొడవలూరు: అపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు ఆదివారం విజయవాడలో జరిగాయి. ఈ ఎన్నికల్లో మండలంలోని నాయుడుపాలెం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.చక్రపాణి రాష్ట్ర సహాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన్ను అపస్ మండల శాఖ నాయకులు సీహెచ్.శ్రీనివాసులు, మణికంద్రాచారి, ఏవీ.రంగారావు అభినందించారు.

ఫిట్‌నెస్ జారీ ఇక పర్‌ఫెక్ట్‌గా



నెల్లూరులో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్

- ఏర్పాటుకు వేగంగా సన్నాహాలు
- మాన్యువల్ టెస్ట్‌కు గుడ్‌బై
- 6 మంది బిడ్‌లు దాఖలు
- త్వరలో టెండర్లు ఖరారు

రవాణా శాఖలో సేవలను పారదర్శకంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రైవేటు వ్యక్తులు, దళారులను ఆశ్రయించకుండా నేరుగా వాహనదారులు, వినియోగదారులే తమకు కావాల్సిన సేవలను వినియోగించుకునే వీలు కల్పించింది. ఇప్పటికే 83కు పైగా సేవలను ఆన్‌లైన్ ద్వారా అందజేస్తుండగా తాజాగా డ్రైవింగ్ లైసెన్స్‌ను పారదర్శకంగా ఇచ్చే విధంగా ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ నిర్మాణాన్ని ప్రారంభించారు. వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను జారీ చేసేందుకు కూడా ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు ప్రారంభించారు.

నెల్లూరు (టౌన్): ప్రస్తుతం వాహనాల ఫిట్‌నెస్‌ను మాన్యువల్ పద్ధతిలో టెస్టింగ్ చేసి అధికారులు సర్టిఫికెట్ జారీ చేస్తున్నారు. వాహనం కండిషన్‌లో లేకున్నా డబ్బులు ముట్టజెప్పితే చాలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ చేతిలోకి వస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ద్వారా వాహనం కండిషన్‌గా ఉంటేనే సర్టిఫికెట్ అందజేసే పరిస్థితి ఉంది. వాహన ఫిట్‌నెస్‌ను వీడియో కెమెరాలు, సెన్సార్లు పరీక్షించిన తరువాతే సర్టిఫికెట్‌ను అందజేసే పరిస్థితి ఉంది. టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది.

రోజుకు 100కు పైగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ

జిల్లా పరిధిలో నెల్లూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు ప్రాంతాల్లో రవాణాశాఖ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2.5 లక్షలకు పైగా రవాణా వాహనాలు ఉన్నాయి. వీటిల్లో ట్రావెల్స్, టూరిస్టు బస్సులు, లారీలు, ఆటోలు, మ్యాక్సీక్యాబ్, మోటారు క్యాబ్ తదితర వాహనాలు ఉన్నాయి. రవాణా వాహనాలు ప్రతి ఏడాది ఆయా ప్రాంతాల్లోని రవాణా అధికారుల ద్వారా ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను పొందాల్సి ఉంటుంది. కొత్త వాహనాలైతే రెండేళ్ల వరకు ఫిట్‌నెస్ ఉంటుంది. మాన్యువల్ ద్వారా ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను జారీ చేస్తుండటంతో అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. వాహనం కండిషన్‌లో లేకున్నా రవాణా అధికారులకు డబ్బులు ముట్టజెప్పితే ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను జారీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.




ఫిట్‌నెస్‌కు వచ్చిన వాహనానికి సంబంధించి పత్రాలను పరిశీలిస్తున్న డీటీసీ చందర్

ఆరు బిడ్లు దాఖలు

ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటుకు మొత్తం 6 మంది ఆన్‌లైన్‌లో బిడ్‌లు దాఖలు చేశారు. గతనెలలో బిడ్‌లను ఓపెన్ చేశారు. బిడ్ దాఖలు చేసిన వ్యక్తులకు సంబంధించిన స్థలాన్ని తనిఖీ చేయడంతో పాటు పూర్తి వివరాలు సేకరించి పంపించాలని రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉప రవాణా కమిషనర్ బి.చందర్ నేతృత్వంలో అధికారులు సంబంధిత వ్యక్తుల స్థలాన్ని తనిఖీ చేసి వివరాలు నివేదిక రూపంలో ఈనెల మొదటి వారంలో రాష్ట్ర రవాణా శాఖ కార్యాలయానికి పంపించారు. ఈ వివరాలను పరిశీలించిన అనంతరం ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి టెండరు దక్కించుకున్న ప్రైవేటు వ్యక్తికి బాధ్యతలను అప్పగించనున్నారు.

టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటుకు నిబంధనలు

జిల్లా కేంద్రంలో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. టెస్టింగ్ స్టేషను ఏర్పాటును ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. ఇందుకు సంబంధించి నియమ, నిబంధనలను జారీ చేశారు. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌కు ఎకరం స్థలం ఉండాలని నిబంధన విధించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి 30 కిలోమీటర్లు పరిధిలో ఆ స్థలం ఉండాలి. జాతీయ రహదారి, రాష్ట్ర రహదారి, జిల్లా రహదారి పక్కనే ఉండాలి. స్థలం పక్కన పవర్ స్టేషన్ గాని, హైటెన్షన్ వైర్లు గాని ఉండకూడదు. మెయిన్ రహదారి నుంచి స్థలానికి పోయే దారి కనీసం 7 మీటర్లు వెడల్పు ఉండాలి. టెస్టింగ్ స్టేషనులో సీసీ కెమెరాలు, వీడియో కెమెరాలు, సెన్సార్లు బిగించనున్నారు. వీటి ద్వారా నేరుగా వాహన కండిషన్‌ను తనిఖీ చేయనున్నారు. వాహనంలో ఏ చిన్న లోపం ఉన్నా వీటి ద్వారా బయటపడుతుంది. ఆ తరువాత ఆ లోపాన్ని సరిదిద్దిన తరువాత వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను జారీ చేయనున్నారు.



ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్

పారదర్శకంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు

ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ద్వారా పారదర్శకంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయనున్నాం. వాహనానికి సంబంధించి పూర్తి కండిషన్‌ను సీసీ కెమెరాలు, సెన్సార్ల ద్వారా తనిఖీ చేస్తాం. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీకి సంబంధించి ప్రైవేటు వ్యక్తులు ఎవరినీ ఆశ్రయించాల్సిన అవసరం ఉండదు. త్వరలో టెస్టింగ్ స్టేషను ఏర్పాటుకు సంబంధించి టెండర్లు ఖరారు చేయనున్నాం. అనంతరం పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– బి.చందర్, డీటీసీ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ. పక్కన ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

పవర్ కాదు.. ప్రజాసేవ ముఖ్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
- పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీటీసీ సభ్యులు పవరుంటే ప్రజలకు అన్నీ చేయవచ్చని మాట్లాడారు. దీనికి జెడ్పీ చైర్‌పర్సన్ స్పందిస్తూ ప్రజలకు సేవ చేయడానికి పవర్ అవసరం లేదని, పనిచేస్తే చిరకాలం ప్రజలు గుర్తుంచుకుంటారని అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి ఆధ్వర్యంలో స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. చైర్‌పర్సన్ అరుణమ్మ మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ ఫలాలు అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పదవ తరతి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు దోహదపడే విజయదీపిక బుక్స్‌ను అందిస్తున్నామన్నారు. తెలుగు, ఆంగ్లంలో ముద్రించిన పుస్తకాలను పదవ తరగతి విద్యార్థులకు త్వరితగతిన అందించేలా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ములుముడి -తాటిపర్తి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు కాంట్రాక్టర్ అగ్రిమెంట్ ప్రక్రియను పూర్తిచేసి రోడ్డు పనులు చేసేలా ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నెల్లూరు-కనుపూరు కాలువకు ఈనెలలోనే సాగునీటిని విడుదల చేసేలా ఇరిగేషన్ అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. జెడ్పీటీసీ సభ్యులు సూచించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం విషయంపై డీఈఓ గంగాభవానీతో చర్చించారు. షోకాజ్ నోటీసుల విషయంలో ఉపాధ్యాయులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వివరణతో సరిపెట్టాలన్నారు. పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, డీఆర్‌డీఏ, డ్వామా, వ్యవసాయ శాఖ, హార్టికల్చర్, ఐసీడీఎస్, ఐటీడీఏ, సివిల్ సప్లై తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. రూ.250.76 కోట్లతో 659 గ్రామ సచివాలయ భవనాలు నిర్మాణాలు చేపట్టగా ఇప్పటి వరకు 334 భవన నిర్మాణాలు పూర్తి అయ్యాయని అధికారులు వివరించారు. రూ.143 కోట్లతో 656 రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు చేపట్టగా 238 ఆర్‌బీకేలు పూర్తి అయ్యాయని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

‘విద్యుత్’లో విప్లవాత్మక సంస్కరణలు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి
- గొలగమూడి వద్ద 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం



సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తదితరులు

వెంకటాచలం: రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రికి సాధ్యంకాని విధంగా కోట్లాది రూపాయలతో విద్యుత్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలం మండలం గొలగమూడి వద్ద రూ.48.07 కోట్లతో నిర్మించిన 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. గొలగమూడి విద్యుత్ ఉప కేంద్రం నుంచి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.4,020 కోట్లతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న 12 నూతన సబ్‌స్టేషన్లకు ప్రారంభోత్సవాలు, రూ.2,478 కోట్లతో 16 కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు శంకుస్థాపనలు చేయడం విద్యుత్ రంగంలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని అన్నారు. రాష్ట్రంలో రైతాంగానికి 9 గంటలు పగటిపూట విద్యుత్ అందించాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయలు వెచ్చించి సబ్‌స్టేషన్ల నిర్మాణం, ట్రాన్స్‌మిషన్ల విస్తరణ చేపట్టినట్లు వివరించారు. వెంకటాచలం మండలం, నెల్లూరు రూరల్, నెల్లూరు సిటీ పరిసర ప్రాంతాల్లోని సుమారు లక్ష మందికి సమర్థవంతంగా విద్యుత్ అందించేందుకు గొలగమూడి వద్ద 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, మండలాల ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు కొరుటూరు వద్ద 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నూతనంగా నిర్మించినట్లు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ల ఏర్పాటు వల్ల భవిష్యత్‌లో వ్యవసాయ, పరిశ్రమలు, గృహ అవసరాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించవచ్చునన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ గొలగమూడిలో 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించడం వల్ల సుమారు లక్ష మందికి పైగా ప్రయోజనం కలుగుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయాలతో రాష్ట్ర ప్రజలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, ఏపీ ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్ ఎస్ఈలు కె.శ్రీనివాస్, విజయన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చిన్నప్ప శేఖర్, రవికుమార్, జయకృష్ణారెడ్డి, ఏఈ మహేంద్రరెడ్డి, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ కోడూరు ప్రదీప్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మందల వెంకటశేషయ్య, జెడ్పీటీసీ పొట్లూరు సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు ఆర్.సుమతి, ఎం.రమణమ్మ, సర్పంచ్ కె.శీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

భర్తపై అనుమానమే వాణి ఆత్మహత్యకు కారణమా?

నెల్లూరు(క్రైమ్): నగరంలోని నేతాజీనగర్ 8వ వీధిలో గోవర్ధన్, వాణి(28) దంపతులు తమ మూడేళ్ల కుమార్తె హరిమోక్తికతో కలిసి నివాసం ఉంటుండగా.. కుమార్తెకు విషమిచ్చి ఆపై వాణి సోమవారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన వేదాయపాళెం పోలీసులు ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో లోన్ సెక్షన్‌లో పనిచేస్తున్న వాణి భర్త గోవర్ధన్‌ను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. పోలీసుల విచారణలో పలువిషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. గోవర్ధన్ క్యాంపుల పేరిట తరచూ నాలుగైదు రోజులు ఇంటికి రాకపోవడం, ఇంట్లో ఉన్నా గతంలో వలే భార్యతో సంతోషంగా లేకపోవడం, క్యాంపులేని సమయంలో రాత్రులు బాగా పొద్దుపోయిన తర్వాత ఇంటికి రావడం, ఆయన ఫోన్‌కు కొత్త నెంబర్ల నుంచి ఫోన్లు, మెసేజ్‌లు రావడంతో వాణికి అనుమానాలు రేకెత్తాయని తెలుస్తోంది. అవే ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించాయా అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. వాణి, చిన్నారి మృతదేహాలకు ప్రభుత్వ వైద్యులు మంగళవారం శవపరీక్ష నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఘరానా దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ. టేబుల్‌పై స్వాధీనం చేసుకున్న సొత్తు

- పెళ్లి మండపాలే లక్ష్యంగా చోరీలు
- రూ.13.15 లక్షల సొత్తు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): పెళ్లి మండపాలే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఓ ఘరానా దొంగను దర్గామిట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.13.15 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో నిందితుని వివరాలను వెల్లడించారు. ప్రగతి నగర్‌కు చెందిన షేక్ బషీర్ ప్రస్తుతం పొదలకూరు రోడ్డు లక్ష్మీనరసింహపురంలో నివాసం ఉంటున్నాడు. ఆయన వడ్డీ, కుదువ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బషీర్ పెళ్లి మండపాలే లక్ష్యంగా 2022 ఏప్రిల్ నుంచి దొంగతనాలకు పాల్పడసాగాడు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు చోరీ సంఘటనలు జరగగా బాధితుల ఫిర్యాదుల మేరకు దర్గామిట్ట, సంతపేట పోలీసులు కేసులు నమోదు చేశారు. నగర డీఎస్పీ డి.శ్రీనివాసులరెడ్డి నేతృత్వంలో దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ బి.వీర వెంకట సుబ్బారావు తన సిబ్బందితో కలిసి దర్యాప్తు ప్రారంభించారు. దొంగతనాలు జరిగిన ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీల పరిశీలన, సాంకేతికత ఆధారంగా నిందితుడు బషీర్‌గా గుర్తించి అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బారాషహీద్ దర్గా సమీపంలో నిందితుడిని మంగళవారం అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా నిందితుడు నేరాలు అంగీకరించాడు. అతని వద్ద నుంచి పిచ్చిరెడ్డి కళ్యాణ మంటపంలో దొంగతనం చేసిన కేసులో 133.050 గ్రాములు, ఫిబ్రవరిలో అదే కళ్యాణ మంటపంలో దొంగతనం చేసిన కేసులో 44.200 గ్రాములు, సెప్టెంబర్‌లో ఏఎల్‌రావు ఫంక్షన్‌హాలులో దొంగతనం చేసిన కేసులో 82.470 గ్రాముల బంగారు ఆభరణాలు, అక్టోబర్‌లో రాఘవ కళ్యాణ మంటపంలో దొంగతనం చేసిన కేసులో 299.600 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.13,15,930 అని డీఎస్పీ తెలిపారు. నిందితునిపై సస్పెక్ట్ షీట్ తెరుస్తామన్నారు. నిందితుడిని అరెస్ట్‌చేసి చోరీ సొత్తు రాబట్టుటకు కృషిచేసిన దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్‌తో పాటు క్రైమ్‌పార్టీ కానిస్టేబుల్స్ ఖాజారహంతుల్లా, షంషుద్దీన్, శామ్యూల్, వేణులను డీఎస్పీ అభినందించారు.

క్లుప్తంగా

జాతీయ కబడ్డీ పోటీలకు నిరీష



నిరీష

ఉలవపాడు : జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నిరీష ఎంపికైనట్లు వ్యాయామ అధ్యాపకుడు శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. తొమ్మిదో తరగతి చదువుతున్న నిరీష ఈనెల 24 నుంచి 26 వరకు చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ విభాగంలో ప్రకాశం జట్టుకు ప్రాతినిధ్యం వహించి మంచి ప్రతిభ కనపరిచింది. జట్టు కెప్టెన్‌గా ఉండి మూడో స్థానం సాధించడంలో కీలకపాత్ర పోషించింది. దీంతో జాతీయస్థాయి జట్టుకు నిరీష ఎంపికైంది. జనవరి 3 నుంచి రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరుగనున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాసులు, గ్రామస్తులు నిరీషను అభినందించారు.

పారదర్శకంగా కులగణన

- ఐదు జిల్లాల కుల సంఘాల నేతలతో తిరుపతిలో ప్రాంతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్సీ

తిరుపతి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కులగణనను పారదర్శకంగా చేపడుతామని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ పరిధిలో ఉన్న ప్రియదర్శిని ఆడిటోరియంలో కులగణన ప్రాంతీయ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సుకు తిరుపతి, చిత్తూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలకు చెందిన కులసంఘాల నేతలు హాజరయ్యారు. ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లు చేపట్టారు. ఈ సదస్సు సభాధ్యక్షులుగా కలెక్టర్ వెంకటరమణారెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగితో పాటు వలంటీర్ కులగణనలో పాల్గొంటారని వెల్లడించారు. ఇంటి సభ్యుల బయోమెట్రిక్‌తో పాటు, సచివాలయ బయోమెట్రిక్ ఉంటేనే యాప్ తీసుకుంటుందని స్పష్టం చేశారు. వంద శాతం పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. తొమ్మిది దశాబ్దాల తర్వాత కులగణన చేపడుతున్నట్లు వెల్లడించారు. కులాల వారీగా జనాభా లెక్కించడం వల్ల ప్రభుత్వ పథకాల రూపకల్పనకు ఉపయోగపడుతుందని వివరించారు. కుల సంఘాలతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంఘాల నేతలు సంపూర్ణంగా సహకరించాలని ఆయన కోరారు.

వ్యభిచార గృహంపై దాడి

నెల్లూరు(క్రైమ్) : నివాసాల మధ్య గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై నవాబుపేట పోలీసులు దాడి చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రాజుపాళేనికి చెందిన విజయ రెండు నెలల కిందట లక్ష్మీపురంలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచార గృహం నిర్వహిస్తోంది. దీనిపై పక్కా సమాచారంతో మంగళవారం నవాబుపేట ఇన్‌స్పెక్టర్ ఎం.బాబి తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ముగ్గురు విటులతో పాటు నిర్వాహకురాలి ఇద్దరు స్నేహితురాళ్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కాగా విజయ పరారీలో ఉండడంతో ఆమె కోసం గాలిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రైతన్న బిజీబిజీ

ఓ వైపు ఈశాన్య రుతు పవనాలతో కురుస్తున్న జోరు వర్షం.. మరో వైపు సోమశిల నుంచి విడుదలవుతున్న సాగునీటితో రైతన్నలు వ్యవసాయ పనుల్లో బిజీబిజీ అయ్యారు. దమ్ము చేస్తూ.. నారు తీస్తూ.. నాట్లు వేస్తూ.. ఉత్సాహంగా సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. బుచ్చిరెడ్డిపాళెంలోని పెనుబల్లిలో పొలాల వద్ద రైతులు, కూలీలు మంగళవారం ఉత్సాహంగా వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ట్రాక్టర్‌తో పొలాన్ని దమ్ము చేస్తూ..



ఆనందంగా వరినారు చూపుతున్న రైతు



వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

బతికి సాధించు

- క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు
- అర్ధాంతరంగా ముగుస్తున్న జీవితాలు
- మానసిక ధృడత్వం అవసరమంటున్న వైద్యులు



నెల్లూరు(క్రైమ్): కుటుంబ కలహాలు.. ఆర్థిక ఇబ్బందులు.. ప్రేమవిఫలం.. చెడు వ్యసనాలు.. వెంటాడుతోన్న అనారోగ్యం.. తల్లిదండ్రుల మందలింపు ఇలా కారణాలు ఏమైనా మానసిక ఒత్తిడితో ప్రాణాలు తీసుకుంటున్న ఘటనలు జిల్లాలో నిత్యకృత్యంగా మారాయి. గడచిన నెల రోజుల్లో సుమారు 20 మంది బలవన్మరణం చెందారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఎన్నో బంధాలను చిధిమేస్తున్నాయి. అయిన వారిని కన్నవారిని పుట్టెడు దుఃఖంలోకి నెట్టేస్తున్నాయి. సమస్య ఏదైనా ఓర్పుగా పరిష్కారం వైపు అడుగులు వేయాలే తప్ప భయపడి బలవన్మరణానికి పాల్పడితే నమ్ముకున్న వారి పరిస్థితి ఏమిటో గ్రహించాలి. అనుబంధాలు, ఆత్మీయతలను ఒక్కసారి గుర్తుచేసుకుని క్షణం పాటు ఆలోచిస్తే జీవితాన్ని జయించవచ్చు. నిండు నూరేళ్లు సంతోషంగా గడిపేయవచ్చు.

తీరిక లేని జీవితాలు

ఒక్కప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఎవరికైనా సమస్య వస్తే తమదిగా భావించి పెద్దవారు క్షణాల్లో పరిష్కారం చూపేవారు. సలహాలు సంప్రదింపులుండేవి. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. లోకం తీరు మారుతోంది. కుటుంబ సభ్యులను కూడా పట్టించుకోలేనంతగా మారిపోతున్నారు. ఇప్పటి తరం బాగా సున్నిత మనస్కులుగా తయారవుతున్నారు.

జిల్లాలో ఆత్మహత్యలు	
2020లో	74
2021లో	85
2022లో	90
2023లో	65 మందికిపైగా
	(ఇప్పటి వరకు)

పరుగు ప్రపంచంలో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై చిన్నచిన్న కుటుంబాలు ఏర్పడ్డాయి. దీంతో చిన్న సమస్యకు కూడా మనస్పర్థలు ఏర్పడుతున్నాయి. కుటుంబ సమస్యలు తలెత్తిన సమయంలో బాధలు మరొకరితో చెప్పుకోలేక వారిలో వారే కుమిలిపోతూ బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

- సమస్యలు ఎదురైనప్పుడు క్షణికావేశం ఆత్మహత్యకు దారితీస్తోంది. జీవితం, సమస్యల పట్ల సరైన అవగాహన లేకపోవడమూ కారణమే. మనిషి జీవితంలో సుఖ దుఃఖాలు, లాభనష్టాలు, జయాపజయాలు సహజం. సంతోషంలో పొంగిపోవడం, దుఖంలో కృంగిపోవడం తగదు. రెండింటిని సమానంగా స్వీకరించినప్పుడే జీవన ప్రయాణం సాధ్యమవుతుంది.

ఇలా ఉంటే జాగ్రత్త పడాలి

ఒంటరిగా ఉండటం, సరైన ఆహారం తీసుకోకపోవడం, నిద్రలేకపోవడం, రాత్రివేళల్లో ఆలోచనలతో ఉండటం వంటి లక్షణాలు ఉన్నవారిని కుటుంబసభ్యులు ప్రారంభంలోనే గుర్తించాలి. వారితో సన్నిహితంగా మెలుగుతూ వీలుచేసుకుని మాట్లాడితే సమస్య తెలుస్తుంది. వాటి పరిష్కారానికి మానసిక వైద్యుని వద్దకు తీసుకెళ్తే ప్రయోజనం ఉంటుంది.

- రాజ్యాంగం జీవించే హక్కును కల్పించింది. ఆత్మహత్యకు యత్నించిన వారు సెక్షన్ 309 ప్రకారం శిక్షార్హులు. ఈ నేరానికి పాల్పడిన వారికి ఏడాది జైలుశిక్ష లేదా జరిమాన విధించవచ్చు.

గత పదిరోజుల్లో జరిగినవి

- గుడ్లూరులో వెంటాడుతోన్న అనారోగ్యం, తండ్రి మందలించాడని ఓ వివాహిత ఎలుకల మందు తిని ఆత్మహత్య చేసుకుంది.
- చేజర్ల మండలంలో ఉద్యోగం పోవడంతో కుమారుడు ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. దీనిని చూసి తట్టుకోలేని తండ్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ కుమారుడు కూడా మరణించాడు.
- ఆత్మకూరులో కుమారులు చూడటం లేదని మనస్తాపానికి గురైన వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు.
- నెల్లూరులో బ్యాక్‌లాగ్ సబ్జెక్ట్‌లను పూర్తి చేయాలని తండ్రి మందలించడంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.
- దంపతుల నడుమ విభేదాలో మరే ఇతర కారణమో తెలియదుకానీ నేతాజీనగర్‌లో ఓ తల్లి తన కుమార్తెకు విషం ఇచ్చి ఆపై ఆత్మహత్య చేసుకుంది.

ఆ భావన నుంచి ఇలా బయటపడండి



ఆత్మహత్య భావనను ప్రతిఒక్కరూ ధైర్యంగా ఎదుర్కొనవచ్చు. ఆత్మహత్య భావనలో ఉన్న వారిని ఒంటరిగా ఉంచకూడదు. వీలైనంత వరకు ఇంట్లో వారందరి మధ్య మెలిగేలా చూసి ధైర్యం నింపాలి. ఆత్మ విశ్వాసం, పాజిటివ్ థింకింగ్, పుస్తక పఠనం, కౌన్సెలింగ్ ప్రక్రియ శక్తివంతంగా పనిచేస్తాయి. జీవితంపై ప్రతికూల భావాలను వ్యక్తీకరించినప్పుడు కుటుంబసభ్యులు తేలికగా తీసుకోకుండా మానసిక వైద్యనిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి.

– డాక్టర్ వి.సురేష్‌బాబు, మనోవికాస వైద్యనిపుణుడు

స్పీడు బ్రేకరే యమపాశమైంది

- బైక్ అదుపుతప్పి హెచ్‌ఎం దుర్మరణం



హెచ్‌ఎం ఉమాశంకర్ మృతదేహం

పొదలకూరు : సమ్మెటివ్ పరీక్షలు ప్రారంభ రోజున పాఠశాలకు సకాలంలో వెళ్లాలని మోటారుబైక్‌పై వెళ్తున్న ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడి పాలిట స్పీడుబ్రేకర్ యమపాశంగా మారిన ఘటన పొదలకూరు-నెల్లూరు మెయిన్ రోడ్డు నుంచి చాటగొట్ల-బిరదవోలుకు వెళ్తున్న రోడ్డులో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌చార్జి ఎస్సై మస్తానయ్య కథనం మేరకు వివరాలు.. నెల్లూరు నగరంలోని సుందరయ్య కాలనీలో నివాసం ఉంటున్న నాగిశెట్టి ఉమాశంకర్(59) పొదలకూరు రామ్‌నగర్ గేటుసెంటరు ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా ఐదేళ్లుగా పనిచేస్తున్నారు. రోజూ మోటారుబైక్‌పై పాఠశాలకు వచ్చి వెళ్తుంటారు. ఈ క్రమంలో పట్టణంలో సిమెంటురోడ్డు నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నాయని నెల్లూరు నుంచి మండలంలోని చాటగొట్ల-బిరదవోలు మార్గం గుండా బైపాస్ రోడ్డులో స్కూలుకు వస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ మార్గంలో పొలాల వద్ద లీజుదారులు పంచాయతీరాజ్‌శాఖ అనుమతులు లేకుండా ఇటీవల నిర్మించిన కొత్తరోడ్డును ఇష్టానుసారం తవ్వేసి పైపులు వేసుకుని ఎత్తుగా స్పీడ్‌బ్రేకర్లను నిర్మించారు. దీంతో హెచ్‌ఎం ఉమాశంకర్ స్పీడ్‌బ్రేకర్లు లేవనుకుని వెళ్లడంతో బైక్ అదుపుతప్పి కిందపడి దుర్మరణం చెందారు. ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లి వస్తానని చెప్పి మృత్యుఒడికి చేరుకున్న తండ్రిని చూసి ఇద్దరు మగపిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎంఈఓ శేషాద్రివాసు ఘటనా స్థలానికి చేరుకుని సంతాపం వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా స్పీడ్‌బ్రేకర్ నిర్మించిన వారి వివరాలు సేకరించి చర్యలు తీసుకుంటామని ఎస్సై మస్తానయ్య వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు.

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి



దిలీప్‌కుమార్ మృతదేహం

గుడ్లూరు : ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడి సోమవారం రాత్రి ఓ వ్యక్తి మృతి చెందగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన తెట్టులో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని సాలిపేట గ్రామానికి చెందిన తెళ్ల దిలీప్‌కుమార్(50) మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. కావలిలోని ఓ వైద్యశాలకు సోమవారం వెళ్లి చూపించుకుని బస్సులో బయలుదేరి రాత్రి తెట్టులో దిగాడు. రోడ్డు పక్కన నడుచుకుంటూ సాలిపేటకు వెళ్తుండగా ఒక్కసారిగా మూర్ఛ రావడంతో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న మురుగు కాలువలో పడిపోయాడు. ఎవరూ గమనించకపోవడంతో మృతి చెందాడు. మంగళవారం ఉదయం గ్రామస్తులు కాలువలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు సాలిపేట గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని గ్రామానికి తీసుకువెళ్లారు. వైద్యశాలకు వెళ్లి వస్తానని తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పెయ్యదూడల పథకంతో ఆర్థికాభివృద్ధి

- జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ మహేశ్వరుడు



సార్టెడ్ సెమన్ క్యాన్‌ను అందజేస్తున్న జేడీ మహేశ్వరుడు, డీడీ సోమయ్య

పొదలకూరు : పాడిరైతులు పెయ్యదూడల ఉత్పత్తి పథకాన్ని సద్వినియోగం చేసుకుంటే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని జిల్లా పశు వైద్యాధికారి(జేడీ) డాక్టర్ మహేశ్వరుడు పేర్కొన్నారు. పొదలకూరు పశువైద్యశాలలో పశువిజ్ఞాన బడిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ ప్రతి మంగళవారం పశువైద్యశాఖ పశువిజ్ఞాన బడిని నిర్వహిస్తారన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో లింగ నిర్ధారిత వీర్యం(సార్టెడ్ సెమన్) ద్వారా రైతులు పెయ్యదూడల ఉత్పత్తిని పెంపొందించుకోవాల్సిందిగా సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.1,350 విలువైన వీర్యాన్ని రైతులకు సబ్సిడీపై రూ.500 లకే అందజేస్తున్నట్లు తెలిపారు. గేదె చూడు కట్టకుంటే రైతులు చెల్లించిన నగదును తిరిగి చెక్కు రూపంలో అందజేస్తారన్నారు. మండలంలోని తాటిపర్తిలో 12 మంది రైతుల గేదెలు చూడు కట్టకుంటే వారు చెల్లించిన మొత్తాన్ని తిరిగి అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకుని పాడిపశువులకు రోగాలు సోకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టి.సోమయ్య మాట్లాడుతూ ప్రస్తుతం ముసర వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందని, వెంటనే రైతులు పశువులకు టీకాలు వేయించాల్సిందిగా సూచించారు. ప్రభుత్వం పాడిపరిశ్రమను ప్రోత్సహించేందుకు వివిధ రకాల పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పశువుల పౌష్టికాహారం కోసం మిక్సర్‌ను రైతులకు అందజేస్తున్నట్లు వెల్లడించారు. పెయ్యదూడల ఉత్పత్తి పథకం రైతులకు ఉపయోగపడుతుందని వివరించారు. అనంతరం పొదలకూరు సహాయ సంచాలకులు డాక్టర్ అరుణ, ఆల్తుర్తి పశువైద్యాధికారి డాక్టర్ రాధిక మాట్లాడారు. కార్యక్రమంలో పాడిరైతులు, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మధరలు (కిలో)	
పెద్దవి	: రూ.45
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.8
పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు	
బ్రాయిలర్:	రూ.89
లేయర్ :	రూ.95
బ్రాయిలర్ చికెన్:	రూ.166
స్కిన్‌లెస్ చికెన్	: రూ.186
లేయర్ చికెన్	: రూ.162

కుల సంఘాలతో రాజకీయాలు తగదు

- వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి



మాట్లాడుతున్న పాలకీర్తి రవి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): టీడీపీ, జనసేన నేతలు కుల సంఘాల పేరుతో రాజకీయాలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి అన్నారు. నగరంలోని విద్యుత్ భవన్ ఆవరణలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వీరంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్ స్థానికేతరుడైన భానుచందర్‌ను విధుల నుంచి తొలగించడంపై కొందరు సీఎం వైఎస్ జగన్‌కు వ్యతిరేకంగా మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాకే గిరిజనులకు పెద్దపీట వేశారని, కుల సంఘాల ముసుగులో పచ్చనేతలు రాజకీయాలు చేయటం తగదని హితవు పలికారు. భానుచందర్‌పై పలు ఆరోపణలు రావడంతో అతన్ని విధుల నుంచి తొలగించారని వివరించారు. స్థానికులకు ఉద్యోగాలు రాకుండా చేస్తున్న టీడీపీ నేత సోమిరెడ్డికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. అనంతరం ఆయన గిరిజనులతో కలిసి ఎస్పీడీసీఎల్ ఎస్ఈ విజయన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నేతలు సురేంద్ర, రామయ్య, కనకయ్య, పోలమ్మ, మణి, కార్తీక్ పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు



ప్లాట్ల వద్ద ఆగిన బస్సు

వెంకటాచలం : ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటన మండలంలోని గొలగమూడి క్రాస్‌రోడ్డు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. నెల్లూరు వైపు నుంచి ముందు వెళ్తున్న లారీని అదే మార్గంలో గూడూరు వైపు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో బస్సు అదుపుతప్పి జాతీయ రహదారి పక్కనే ఖాళీ ప్లాట్ల వద్ద నిలిచింది. బస్సు ముందు భాగం దెబ్బతినగా, ప్రయాణికులెవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.